# ఎత్తుకు పై ఎత్తు

జన సముద్రం ముందు ఉపన్యసించి అలసిపోయిన మంత్రిగారు విడిదికి చేరుకున్నారు. వెన్నెల పిండారబోసి కూచుంది.

సభాస్థలి వదలిన ప్రజాసమూహం సమ్మక్క సారక్క జాతరలా మారింది. ఒకరినొకరు తోసుకుంటూ ఇంటి ముఖం పడ్తున్నారు. విన్న ఉపన్యాసమ్మీద వ్యాఖ్యానాలు చేస్తూ.... నిట్టూర్పులు రాలుస్తూ.

గ్రామదేవతలు కార్లలో చిల్లరదేవుళ్ళ కాళ్ళతో మంత్రిగారిని ఫాలో ఐనారు-వానాకాలం చెరువులోకి చేరుతున్న కప్పల్లాగ. గ్రూపువన్ పరీక్షలోనెగ్గి డైరెక్టుగా రిక్రూటైన డియేస్పీ కె. కె. రావు బందోబస్తును పర్యవేక్షిస్తున్నాడు

మంత్రిగారి సొంతూరైనందు కాటౌనుకో ప్రత్యేకత వచ్చింది. సొంతిల్లో స్వేచ్ఛ హారతి కర్పూరం కాబట్టి గెస్టౌజునే రెస్టౌజుగా ఎన్నుకున్నారు మంత్రిగారూ, వందిమాగదులు

అధికార అనధికారుల్తో లాంఛన ప్రాయమైన మంతనాలు ముగిశాయి. పై రవీరాయుళ్ళ అంచనాలో కొలిక్కి చేరు కున్నాయి. ఇంకేముంది.... మందుపార్టీ మూడుసీసాలు ఆరు గ్లాసులుగా కొనసాగింది. పంచకట్లూ, పై జామాలునిశాదేవిని కౌగిలించుకుని జారుకున్నాయి బయట చీకటి అలుముకుంది... మబ్బుల్లో మొహం దాచుకున్న చంద్రుని ఉనికి తెలియనీయ కుండా ఏ.సి. రూంలో........ మంచమ్మీదఎన్నిసార్లు బొర్లినా నిద్రాదేవి లొంగిరాలేదు మంత్రిగారి కౌగిట్లోకి.

ఒళ్ళంతా పేడెక్కింది. ఏదో కావాలంటుంది. కావాల్సింది దొరక్కపోతే ఏదో ఐపోయేట్టుంది.

మదిలో డియస్పీ మెదలగానే పిలిపించారు.

"నమస్తే సార్!" సెల్యూట్ చేసి నిలబడ్డాడు కే. కే. రావు

"ఏఁవిటోయ్! నీపేరూ.... నీపేరూ...." ఆగిపోయారు.

"అదేసార్! కే కే. రావు – అంటే కాకరకాయల కమలాకర్ రావు."

"ఇంతకు ముఁదీవూళ్ళోనే......."

"ఔన్సార్! కొన్నాళ్ళక్రిత మిక్కడే పంజేసానోసారి. మధ్యలో ట్రాన్సుఫరై పోయాను. తిరిగి ఇక్కడే డియస్పీగా జాయినయాను... అఫ్‌కోర్స్! మీకూ తెలుసనుకోండీ...."

"ఔను! నిన్ను కావాలనే ఈ ఊరు వేయించానోయ్!" మంత్రిగారి కనుబొమ లెగిరి పడ్డాయి. తెలుగు సినిమాలోని విలన్ నవ్వులు పెదవుల చిందులాడాయి.

" నువ్వే పంజేయాలోయ్! "

" చెప్పండి సార్! "

" నువ్వీమధ్యే పెళ్ళిజేసుకున్నావు గదూ.... "

" ఔన్సార్! ఇల్లుగూడా మీఇంటి దగ్గరే దొరికింది. మీ ఫామిలీతో మంచి ఫ్రెండ్‌షిప్ కూడా కుదిరిందండి.... మీ అమ్మాయికి నా భార్యకు మంచి స్నేహం గూడా కలిసిందండి. " రాని చిరునవ్వుల్ని పులుముకుంది ముఖారవిందము.

" అఁసరే... నిద్రొచ్చి చావడంలేదు.... నీ భార్యనోసారి ఇక్కడికి పంపించు "

" సార్....! " పళ్ళు పటపటలాడాయి. పౌరుషం పొంగుకొస్తుంది.

డోంట్ బి సిల్లీ....... ఆరోజుల్లో నువ్వు చేసిన పాపానికి ప్రాయశ్చత్తం........ ఇప్పుడు... ఈ రూపంలో చెల్లించుకో. గుట్టు చప్పుడు కాకుండా పనిజరిపించు........ "

" అది అసాధ్యంసార్! " పిడికిళ్ళు బిగుసుకు పోతున్నాయి. ఒళ్ళంతా చెమట. యూనీఫారం తడిసి పోతుంది. కాని....... కాని... ....

" నీకిష్టం లేకపోతే మానుకో... తెలుసుగా నా సంగతి. " ఆకలి పులి కోరలు చూపించింది.

కోపం చప్పున చల్లారి ఐసైపోయింది. నిస్సహాయత వెక్కిరించింది. వెనుదిరిగాడు కే కే రావు

" చూడు! నీ భార్య ఇక్కడి కొచ్చింతర్వాత నోరు విప్పకుండా చేసి పంపించు... వృద్ధిలోకి రావాల్సిన వాడివి.... "

మంత్రి మాటలు బాణాల్లా గుచ్చుకున్నాయి.

* * * * * * *

సర్వేశ్వర హోటల్ సన్నకారుదైన రద్దీగా ఉంటుంది.

అదే హోటల్లో కొన్నాళ్ళ క్రితం బిక్కుబిక్కుమంటూ సర్వర్‌గా చేరిన దోసకాయల డానయ్య ఓనర్ను గోల్‌మాల్ చేసి...... అతని బలహీనతల్ని బహిరంగం చేస్తానని బెదిరించి తాను ఓనరై కూచున్నాడు. కొద్దిరోజుల్లో మరికొన్ని వ్యాపారాలు గూడా ప్రారంభించాడు. రాజకీయాలంటే వల్లమాలిన అభిమానం కాబట్టి ఎన్నో పదవులకు సూటి బెట్టడం జరిగింది. చివరికి మిగిలింది మాత్రం మునిసిపల్ కౌన్సిలర్ పదవి.

నాలుగు నెలల్లో నాలుగు పార్టీలు మార్చి బోలెడంత అర్థం, పరమార్థం, పలుకుబడి, అనుభవాన్ని సంపాదించుకున్నాడు. తాను స్వయంగా కండలు పెంచడమే కాకుండా .... టౌన్లోని మూడు వ్యాయామశాలలకు సంస్థాపకధ్యక్షుడైనాడు. బోలెడంత శిష్యగణం....కొందరు శిష్యులు అప్పుడే పస్తాదులై కూచున్నారు.

హోటల్లో .... తన ప్రత్యేక గదిలో కూచుండి రాజకీయ చక్రం తిప్పుతుంటాడు. అంతరంగికులకు తప్ప అల్లాటప్పాగాళ్ళ కెవరికీ అందులో ప్రవేశించే ధైర్యంలేదు.

బీదా బిక్కీలంటే కొండకచో జాలి

ఆ ఊళ్ళో చాన్నాళ్ళ నుండి అడుక్కుతినే అనాథ పెధవకు (వాడిపేరెవ్వరికీ తెలీదు) రోజో ముద్ద పడేస్తుంటాడు విశ్వాసం గల కుక్కలా వాడు చాలాసేపు హోటల్‌ముందే పొద్దుబుచ్చుకుంటాడు. అందుకే వాడంటే ఆప్యాయత అల్లుకుపోయింది.

ఆరోజు ... చలిపులి ఆ అడారివెధవను పట్టుకు పీడిస్తుంది. హోటల్ అరుగుమీదే పడుకున్నాడు. రాత్రి రంగ ప్రవేశం చేయగానే చలిపులి బలం రెండింతలైంది. నిండాకప్పుకుని గడగడలాడుతున్నాడు.

దానయ్య జాలిగుండె కరిగింది. వాణ్ని లేపి, కూచోబెట్టి వేడిపాలగ్లాసు అందించాడు. వాడది గటగటా తాగేసి రెండు చేతులు జోడించాడు.

"ఏమిట్రా .... ?" అడిగింది జాలిగుండె.

"ఈరోజు అరుగుమీద పడుకోలేనయ్యా. దయచేసి ఈ ఒక్కరోజు మీగదిలో పడుకోనీయయ్యా...."

వాడంతగా బతిమాలుతూంటే కాదనలేక పోయాడు.

"సరేలే .... వచ్చి ఓమూల పడుకో ..." అన్నాడు

చిన్న గోనె సంచి .... దాంట్లో ఏవేవో సామాన్లు-వాడి-సర్వస్వం. దాంతోనే లోపలికెళ్ళి ఓమూల పడుకున్నాడు పొద్దుపోయిన తర్వాత .... ఊరంతా నిద్రల్లోకి జారుకున్న తర్వాత గోనె సంచిలోని తన సామాన్లకు పని కల్పించాడు.

తెల్లవారగానే వార్త గుప్పుమంది ఊరంతా - సర్వేశ్వర హోటల్లోని ప్రత్యేక గదిలో ఒక కుటీర పరిశ్రమ నడుస్తుందట.... దాంట్లో వందరూపాయల నోట్లు తయారౌతున్నాయట ... అడుక్కుతినే అడారివెధవ రాత్రంతా అందులో గడిపి దోసకాయల దానయ్యను పోలీసులకు పట్టిచ్చాడట. వాడిపేరు కాకరకాయల కమలాకర్రావట .... ఉద్యోగం ... పోలీసు డిపార్టుమెంటులో స్పెషల్ బ్రాంచిలోనట. వలవేసి .... ఉడుంపట్టు పట్టాడట ...

బతిమాలినా ....కొన్ని లక్షల రూపాయల ఆశజూపినా వద్దల్లేదట.

కొన్ని గంటల్లో వార్త భాగ్యనగర్ చేరింది దానయ్య పోలీసు స్టేషన్లో స్టేటుమెంటివ్వడం పూర్తికాకముందే టెలిఫోన్ తెగమోగింది. బోటు షికారుకెళ్ళొచ్చినట్టు తిరిగొచ్చేసాడు దానయ్య .... బెయిల్ మీద.

"వాడంతు చూస్తానన—ని కే కే. రావు కొరకు వెతికించాడు.... కాని ఆ డ్యూటీ ఐపోగానే ఆతణ్ని హెడ్క్వార్టర్స్‌కు పిలిపించుకున్నారట.

కోర్టులో కేసుకు కాళ్ళొచ్చినై. దానయ్య రాజధాని నుండి రకరకాల ప్రయత్నాలు చేసి కేసు కాల్లూచేతులు విరగ్గొట్టించాడు.

అసెంబ్లీ ఎలక్షన్లు రానే వచ్చాయి. దోసకాయల దానయ్య నిజాయితీ నిఖార్సైందని కోర్టులోనే రుజువైంది. కాబట్టి పార్టీ టిక్కెట్టు దొరికింది పారితోషికంగా.

ఎమ్మెల్యే కాగానే అతని నిష్కలంక రాజకీయం- మంత్రి పదవిప్పించింది.

"హుఁ ...! ఆనాడు చేసిందో పాపం ....దానికి ఇప్పుడు ప్రాయశ్చిత్తం చెల్లించుకోవాలి .... !?" కే.కే రావు గుండెలో వేయి గునపాలు దిగబడ్డాయి. కాళ్ళు అచేతనంగా ఇంటివైపు దారితీశాయి.

కాస్సేపట్లో మంత్రివద్దకు చేరాడు జంటగా.

రావు వెంటవస్తున్న అందాల భరిణను గమనించగానే మంత్రిగారి నిశాకళ్ళు ఖుషీగా నాట్యంచేశాయి. నాలుక పెదవుల్ని

తడిపేసింది. పట్టుదల పేట్రేగి పటపటలు మానుకొమ్మని పళ్ళను అజ్ఞాపించింది.

కొద్ధిక్షణాల్లో గదిలోపల మంత్రి జంటగా .... బయట డియస్పీ ఒంటరిగా మారారు.

గదిలో ట్యూబులైటారిపోయింది. జీరో బల్బుకు ప్రాణమొచ్చింది అంతకు ముందే.

మంత్రిగారి చేతులామె ఒంటినిండా నాట్యంచేసాయి .... ఆమె చేతులు వెనక్కు కట్టివేయబడున్నాయి, నోట్లో గుడ్డలు కుక్కబడున్నాయి. కే.కే రావులౌక్యానికీ, బ్రతుకనేర్చినతనానికి, అన్నిట్నీమించి......... తాను సృష్టించిన అతని నిస్సహాయితకు జోహార్లర్పించాడు మనస్సులోనే

మదనతాపం ఎత్తుపల్లాల్ని చిత్తుచేస్తుంటే....మజా మరింత మత్తెక్కించింది.

అబల అబలగానే మిగిలింది.

మంత్రిగారు బాత్రూంలో కెళ్ళొచ్చారు. ఆమెలో కదలిక కన్పించలేదు. ట్యూబులైటు వేసాడు కంగారుగా. నిండు వెలుగులో దండి గుండెలు గుబగుబలాడి పోయినై. మంత్రిగారి ఒంటినిండా చెమటలు... ఆతృతగా ఆమె కట్లు విప్పి నోట్లోంచి గుడ్డలు లాగేసాడు.

" అమ్మా....!" అంటూ అరిచాడు.

"నాన్నా....!" అటూ లేచి గట్టిగా తన్నింది ఛాతీమీద. నిలదొక్కు కోలేక కూలబడింది. గుండెలు పగిలేలా ఏడ్చింది.

దానయ్య కేంజీయాలో తోచలేదు. మెల్లిగా లేచి

"నువ్వెందు కొచ్చావమ్మా...?"

"డీయస్పీ అన్నయ్య గారొచ్చి-నన్ను మీరు రమ్మన్నా రని పిలిచారు. నాన్నగారు పిలిచారంటే ఏదో ముఖ్యమైన విషయమ్మయుంటుంది వెళ్ళిర' మ్మని పంపించింది అమ్మ. ఈ బంగళాకి కొద్దిదూరంలో.... మలుపుతిరక్క ముందే నా చేతులు కట్టేసి.... నానోట్లో గుడ్డలు కుక్కబడ్డాయి. అరిచేందుగ్గూడా అవకాశమియ్యలేదు. పిస్టల్‌తో బెదిరించి నడువు మన్నాడు..."

మంత్రి బుర్రలో బ్రహ్మాండం బద్దలైంది.

కన్న కూతుర్నే చెరిచి కొత్తరికార్డు సృష్టించినందుకు ఎవర్ని ఏంచెయ్యాలో.... అంతుబట్టలేదు. నరికిన చెట్టులా మంచమ్మీద పడిపోయాడు.

ఆమెను బాత్రూం ఆహ్వానించింది వెళ్ళి దభీమని బాత్రూం తలుపులు మూసి, గడియ వేసింది.

కిటికీకున్న గాజు తలుపు ఒకే గుద్దుకు ముక్కలైంది. పొడుగాటి గాజుముక్క ఆమె పొత్తికడుపులోకి దూసుకెళ్ళింది.

"అమ్మా...." అంటూ పడిపోయింది.

మంత్రి దోసకాయల దానయ్య తన గుండెలతో పాటు బాత్రూం తలుపులు బాదుతున్నాడు... కూతురు పేరునుచ్చరిస్తూ అరుస్తున్నాడు.

(జలధి-పక్ష పత్రిక – 1-8-1986, 1-9-1986, 16-10-1986
16-10-1986 మరియు 16-1-1986 సంచికలు)